

బియ్యం అక్రమ రవాణా

అధికార పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్ల ప్రమేయంతో ప్రొద్దుటూరులో బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. -10లో



విద్యుత్ షాక్‌తో 15 గొర్రెలు మృతి

చక్రాయపేట మండలంలోని కల్లూరుపల్లె గ్రామం కాట్లగంటివారిపల్లెలో బుధవారం విద్యుత్ ప్రమాదానికి గురై 15 గొర్రెలు మృతి చెందాయి. -10లో

గరిష్టం/కనిష్టం 32.8/21.2

వాతావరణం

జిల్లాలో బుదవారం 21.2 – 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 99592 25774 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు 'శాప్' చైర్మన్ రాక

కడపస్పోర్ట్స్: శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు గురువారం కడప నగరానికి రానున్నారు. ఉదయం 8 గంటలకు తిరుపతిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 11 గంటలకు కడప నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడున్న మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. పీఈటీలు, పీడీల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం స్పోర్ట్స్ స్కూలుకెళ్లి అక్కడి సిబ్బంది, డీఎస్ఏ సిబ్బందితో సమావేశమవుతారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపక సిబ్బంది

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని స్థానిక జేఎన్‌టీయూ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి జేఎన్టీయూ అనంతపురం కళాశాలకు స్థాన చలనం అయ్యారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ జోన్ ఈడీగా పైడి చంద్రశేఖర్



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పైడి చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈడీగా పనిచేస్తున్న చెంగల్‌రెడ్డిని విజయవాడకు బదిలీ చేశారు. 1987లో జూనియర్ ఇంజనీర్‌గా ఆర్టీసీలో చేరిన చంద్రశేఖర్ 1988 నుంచి దాదాపు పది సంవత్సరాలపాటు వివిధ డిపోల్లో మేనేజర్‌గా, 2020లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా, 2017లో కర్నూలు ఆర్ఎంగా, 2024లో ఈడీగా ప్రధాన కార్యాలయంలో పని చేస్తూ కడపకు వచ్చారు. అధికారుల సమన్వయంతో ఆర్టీసీని ముందుకు తీసుకు వెళతామని ఆయన తెలిపారు. అనంతరం పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కేజీబీవీ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లాలోని కేజీబీవీలలో ప్రిన్సిపల్, పీజీటీ, సీఆర్‌టీ, ఇతర విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితా విడుదల చేసినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కేటగిరీ వారీగా అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను అన్నమయ్య బ్లాగ్ స్పాట్ ద్వారా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

త్రైతేశ్వర స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా రాజంపేట డివిజన్ హత్యరాలలోని త్రైతేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మన్నూరు సీఐ రామాంజులు, తహశీల్దార్ పీర్ మున్నీర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషయ్య, ఎంపీడీఓ ప్రసాద్ రావు, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, మాజీ ధర్మకర్త సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కడప ఎస్పీపై బదిలీ వేటు

కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి పాతరేస్తూ.. రాచరికానికి బాటలు వేస్తోంది. జీ హుజూర్ అనకుంటే చాలు ఎంత పెద్ద అధికారిపైనైనా కన్నెర్ర చేస్తోంది. 'నిజాయితీ'గల అధికారికి బదిలీని బహుమానంగా ఇస్తోంది. తాజాగా కడప ఎస్పీపై వేసిన బదిలీ వేటే ఇందుకు నిదర్శనం.

- జీ హుజూర్ అనకపోవడమే అసలు కారణం
- తమ ఆటలు సాగకపోవడంతో ఇన్‌చార్జి మంత్రి సవితకు ఏకరువు పెట్టుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు
- రాష్ట్ర కేబినెట్ సమావేశం అనంతరం బదిలీ ఉత్తర్వులు జారీ అయిన వైనం



ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సాక్షి ప్రతినిధి, కడప: వి. హర్షవర్ధన్‌రాజు. 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. చట్టానికి ఎవరూ అతీతులు కారన్నది ఆయన సిద్ధాంతం. ప్రజల మాన ప్రాణ రక్షణకు పోలీసులు కృషి చేయాలన్నదే ఆయన నైజం .ఐపీసీ సెక్షన్లకు అనుగుణంగానే పోలీసుల చర్యలుండాలనే నిత్యం ఆకాంక్షించేవారు. మరోవైపు గ్యాంబ్లింగ్, మద్యం విచ్చలవిడి విక్రయాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కొరకరాని కొయ్యగా మారారు. ఎస్పీగా ఆయన కొనసాగితే తమ ఇష్టారాజ్య చర్యలకు ఆస్కారం ఉండదని భావించారు. అదే విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఎదుట మంగళవారం ప్రస్తావించారు. బుధవారం రాష్ట్ర కేబినేట్ సమావేశం అనంతరం సాయంత్రం పొలిటికల్ బదిలీ అయ్యారు.

- వైఎస్సార్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా వి.హర్షవర్ధన్‌రాజు జూలై 17న బాధ్యతలు చేపట్టారు. నాలుగు నెలలు (112 రోజులు) గడవగానే బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్, గంజాయి, క్రికెట్ బెట్టింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రకటించారు. సరిగ్గా అదే అమలు చేశారు. దాదాపు అన్ని పోలీసు స్టేషన్లను తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ అందుకు అనుగుణంగా పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారు. ఈ పరిణామం అధికార తెలుగుదేశం పార్టీ నేతలకు ఏమాత్రం మింగుడు పడలేదు. తమ ఏకపక్ష చర్యలకు ఆస్కారం లేకుండా పోతుందనే అక్కసు రోజు రోజుకు బలపడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఇన్‌చార్జి మంత్రి ఎదుట టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఏకరువు పెట్టినట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. బుధవారం రాష్ట్ర కేబినేట్‌లో సైతం ఈ అంశం చర్చకు రావడం.. ఆపై బదిలీ ఉత్తర్వులు వెలువడడం చకచకా జరిగిపోయాయని పలువురు వివరిస్తున్నారు.

సోషల్ మీడియా కార్యకర్త వ్యవహారం సాకు మాత్రమే ..

ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బదిలీకి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి వ్యవహారమే కారణమని అధికార పార్టీ నేతలు లీకులు ఇచ్చారు. వాస్తవంగా అధికార పార్టీ నేతల అక్రమ, చట్టవ్యతిరేక, దౌర్జన్యకర కార్యకలాపాలకు అడ్డుగా నిలుస్తున్నారనేది బలమైన కారణంగా పరిశీలకులు వెల్లడిస్తున్నారు. విపక్షనేత జిల్లాలో ఎస్పీ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్న వాస్తవాన్ని అధికార పార్టీ నేతలు విస్మరించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

డీఐజీ సమీక్ష

కడప అర్బన్: కర్నూలు–కడప రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుతో పాటు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్ష ముగిసే సమయానికి జిల్లా ఎస్పీ బదిలీ ఉత్తర్వులు రావడం గమనార్హం.

ఇన్‌చార్జ్ ఎస్పీగా విద్యాసాగర్

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న వి.హర్షవర్ధన్‌రాజును బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. 2013 బ్యాచ్‌కు చెందిన హర్షవర్ధన్‌రాజు తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేస్తూ ఈ ఏడాది జులై 17న వైఎస్సార్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈయనను హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న వాసన విద్యాసాగర్‌నాయుడును నియమించారు.

నాడు అభిషేక్ మహంతి.. నేడు హర్షవర్ధన్‌రాజు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నీతి నిజాయితీగా పనిచేసే ఐపీఎస్ ఆఫీసర్లకు అర్థాంతర బదిలీలు తప్పడం లేదని మరోమారు రుజువైంది. 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఘటనే జిల్లాలో చోటుచేసుకుంది. ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతి ఎస్పీగా జిల్లాలో బాధ్యతలు చేపట్టిన 102 రోజులకు బదిలీ చేస్తూ అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా 112 రోజులకు హర్షవర్ధన్‌రాజుపై బదిలీ వేటు పడింది. ఈ తంతు వీరిద్దరితోనే ముగియలేదు. 2016లో ఎస్పీగా పీహెచ్‌డీ రామకృష్ణ బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే సమర్థవంత అధికారిగా గుర్తింపు పొందారు. పోలీసులు సైతం విధి నిర్వహణ నిక్కచ్చిగా చేయాలనే నిబంధనలు గట్టిగా విధించారు. ఈ పరిణామం టీడీపీ నేతలకు రుచించలేదు. వెరసి బదిలీ ఉత్తర్వులొచ్చాయి. తర్వాత బాపూజీ అట్టాడ ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను కూడా 14 నెలలకు 2018లో జిల్లా నుంచి సాగనంపారు. పోలీసు విధులకు టెక్నాలజీ జోడించి నేరాల కట్టడికి విశేషంగా పనిచేసిన బాపూజీ అట్టాడ కూడా టీడీపీ నేతల అధికార దర్పానికి బదిలీ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన అభిషేక్ మహంతిని తక్కువ రోజులకే బదిలీ చేయించారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు తిరిగి విధుల్లో చేరిన ఆయన జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జనరల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. తాజాగా చట్టాన్ని అమలు చేయడంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న హర్షవర్ధన్‌రాజును టీడీపీ నేతలు పట్టుబట్టి బదిలీ చేయించడం గమనార్హం.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు!

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథరెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాస్వామ్య హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని.. పోలీసులు వ్యక్తిగత స్వేచ్ఛను హరింపజేయడం అప్రజాస్వామ్యకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన కడపలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాల లోపాలు ఎత్తిచూపడం, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేయడం, దుష్ప్రచారాలను ఖండించడం ఇవన్నీ కూడా ప్రతిపక్ష పార్టీలకు హక్కని తెలిపారు. ఆ హక్కును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా చేస్తుంటే...పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వ్యక్తిగతంగా కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు సైతం భావప్రకటన స్వేచ్ఛను హరించవద్దని ఉత్తర్వులిచ్చిందని వివరించారు. పోలీసులు అత్యున్నత న్యాయస్థానం తీర్పుకు కూడా గౌరవం లేకుండా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

జామీన్‌దారుడిపై దాడి....

కడప తాలూకా పోలీసులు మంగళవారం రాత్రి సోషల్ మీడియా కార్యకర్త పులివెందులకు చెందిన వర్రా రవీంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న రవీంద్రకు జామీన్ ఇచ్చేందుకు వచ్చిన పెండ్లూరు సర్పంచ్ మహేశ్వరరెడ్డిపై పోలీసులు దాడి చేశారని తెలిపారు. ఇదెక్కడి న్యాయమో అంతుబట్టడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా జిల్లా వాసులు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేశారు. అప్పట్లో ఏనాడైనా ఇలాంటి పోకడలు జిల్లాలో ఉన్నాయా? ఎందుకు ఇంతటి అప్రజాస్వామ్యక చర్యలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు, ప్రజాస్వామ్య విలువలు కాపాడండి, అప్రజాస్వామ్యక చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు.

నాలుగు లేన్ల రహదారి నిర్మించాలి

కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖ



కడప కార్పొరేషన్: రేణిగుంట– ముద్దనూరు (ఎన్‌హెచ్–716) జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా వెడల్పు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. బుధవారం కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి ఈ మేరకు లేఖ రాశారు. రేణిగుంట - ముద్దనూరు రోడ్డు అత్యంత ముఖ్యమైన జాతీయ రహదారి అని, ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోడూరు, రాజంపేట, కడప, కమలాపురం, యర్రగుంట్ల, చిలమకూరు, ముద్దనూరు మొదలైన ముఖ్యమైన పారిశ్రామిక, వాణిజ్య పట్టణాల మీదుగా వెళుతుందన్నారు. అంతేగాక కడపలో సిమెంటు పరిశ్రమలైన భారతి, జువారి, ఐసీఎల్ వంటి ముఖ్యమైన పరిశ్రమలు, యరగ్రుంటలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌లు ముద్దనూరు పట్టణం చుట్టూ ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న 2 లేన్ల రహదారిపై ట్రాఫిక్ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని, వాణిజ్య వాహనాలు ఈ రహదారిపై పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయని అందులో వివరించారు. వాణిజ్య వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన పరిశ్రమలు ఉన్న ప్రాంతంతో పాటు భౌగోళిక ప్రాముఖ్యతను, ట్రాఫిక్ భద్రత దృష్ట్యా కడప, ముద్దనూరు పట్టణాల్లో ప్రాధాన్య క్రమంలో నాలుగు వరుసల రహదారిని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

- కడప నుంచి రేణిగుంట వరకు సుమారు 130 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు ఎన్ హెచ్ ఏఐ ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. నాలుగు లేన్ల రహదారిని విస్తరించడంలో ముద్దనూరు నుంచి కడప వరకు బ్యాలెన్స్ రీచ్ మెరుగుపరచడం చాలా అవసరమన్నారు. పైమార్గాన్ని 4 లేన్లుగా అభివృద్ధి చేయడం వల్ల టోల్ ద్వారా నెలకు కోట్లలో ఆదాయం లభిస్తుందన్నారు. పై పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను విజయవాడలోని ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆర్ అండ్ బీ)కి ఇటీవల 2024–25 వార్షిక ప్రణాళిక కింద ఆమోదం కోసం న్యూఢిల్లీలోని ఎంఓఆర్టీ అండ్ హెచ్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్ హెచ్ –716లోని కడప– ముద్దనూరు పట్టణాల మధ్య నాలుగు వరుసల రహదారి మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సీఐడీ తనిఖీలు

మదనపల్లె: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయ పనివేళల ప్రారంభ సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన సీఐడీ అధికారులు రికార్డ్ రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. లోనికి సిబ్బందిని అనుమతించకుండా వారే స్వయంగా కావాల్సిన రికార్డులు తీసుకుని పరిశీలించినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటన దర్యాప్తును ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలుమార్లు సీఐడీ అధికారులు సబ్ కలెక్టరేట్, మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ప్రభుత్వంలో విడుదల చేసిన జీఓ నంబర్.596 ఆధారంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములు, వాటికి సంబంధించిన రికార్డులు, ఈసీలను సీఐడీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటన జరిగి 106 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేదు. అడపాదడపా సీఐడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు, పరిశీలనలు తప్ప ఎలాంటి ప్రగతి లేకపోవడం గమనార్హం.

జిల్లా అభివృద్ధికి కృషి

కొత్త కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్




బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారం ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టర్‌గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ముఖ్య పాలనా అధికారిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో అక్షరాస్యతను పెంచడం, పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన అనే మూడు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. అంతకు ముందుగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీనివాసులు, ఆర్డీవోలు కలెక్టర్ గారికి మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని సెక్షన్ అధికారులు, సిబ్బంది, ప్రముఖులు, పాత్రికేయులు తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టరేట్ పరిశీలన: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చెరుకూరి శ్రీధర్ కలెక్టరేట్‌ను పరిశీలించారు. జేసీ అదితిసింగ్‌తో కలిసి ఆయన కంట్రోల్ రూమ్, ఎస్‌బీసీ సెంటర్, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, పీజీఆర్ఎస్ హాలు, బోర్డు మీటింగ్ హాల్, వీసీ హాలుతో పాటు అన్ని సెక్షన్లకు చెందిన కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి సిబ్బంది విధుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు.

అపార్ కష్టాలు

- అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- కార్డు జారీకి సరిపోలని విద్యార్థుల వ్యక్తిగత వివరాలు
- తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపల్స్, హెచ్ఎంలు
- ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు



కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న అపార్‌కార్డు



జమ్మలమడుగు ఎమ్మార్సీలో విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఒకే నేషన్..ఒకే ఐడీ ఉండాలని 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఒక నెంబర్‌ను కేటాయించడానికి చర్యలు చేపట్టింది. ఆ నంబర్‌ను తయారు చేయడానికి క్షేత్రస్థాయిలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు.

ఉద్దేశం ఇలా..

ఈ పథకంలో భాగంగా అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్‌లో ఒక నెంబర్‌ను కేటాయిస్తారు. ఈ నెంబర్ వల్ల భవిష్యత్తులో సదరు విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు ఆ నెంబర్‌పైన పొందుపరచబడి ఉంటాయి. ఇది జరగాలంటే మూడు రకాల రికార్డులలో ఒకే సమాచారం ఒకే రకంగా ఉంటేనే సాధ్యం అవుతుంది. విద్యార్థి 1వ తరగతి చేరినప్పుడు అడ్మిషన్ రిజిస్టర్, ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ చేసిన వివరాలు, ఆధార్‌కార్డు ఈ మూడింటింలో ఏ చిన్న తప్పు లేకుండా ఒకే రకంగా ఉంటేనే అపార్ నెంబర్ సులభంగా జారీ అవుతుంది. లేకుంటే అపార్ నెంబర్ జారీ కాదు. ఇలా చాలామంది విద్యార్థులకు సంబంధించి ఏదో ఒక దాంట్లో ఏదో ఒక తప్పిదం ఉండనే ఉంది. దీంతో వాటిని సరిచేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పనులన్నీ వదులుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం పదో తరగతికి సంబంధించి...

జిల్లావ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన నామినల్ రోల్స్‌ను పంపాల్సి ఉంది. ఓ వైపు సర్వర్ సమస్యలు, మరోవైపు తీవ్ర ఒత్తిడి. ఈ రెండింటి మధ్య సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా 1వ తరగతిలో చేరే సమయంలో ఇంటి పేరు (సర్‌నేం)తో నమోదు చేసుకుంటారు. సదరు ఉపాధ్యాయులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్‌కార్డుల తయారీ సమయంలో ఇంటి పేరు లేకుండా కేవలం ఒక అక్షరం (ఇనిషియల్)తో నమోదు చేశారు. అలాగే పుట్టిన తేదీ ఏదో ఒకటి వేసేశారు. ప్రస్తుతం ఈ రెండే ఆ పిల్లలకు ప్రధాన సమస్యలుగా మారాయి. ఆధార్‌లో మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే చాలా మంది పిల్లల కుటుంబాలలో ఆ నమోదు జరగలేదు. ఇప్పుడు చేయించడానికి కార్యాలయాల చుట్టూ ప్రదర్శనలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ మార్పులు అంత సులభంగా అయ్యేవి కావు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్ జిల్లాకు సంబంధించి...

జిల్లాలో 2932 పాఠశాలలు, కళాశాలలకుగాను 3,63,145 మంది విద్యార్థులుంటే ఇప్పటి వరకు 2,05,842 మందికి మాత్రమే అపార్‌కార్డు జనరేట్ అయ్యాయి. మిగిలిన వారికి పలు సమస్యల వల్ల కార్డులు జనరేట్ కావడం లేదు. ఈ విషయమై ఇంటర్ ఆర్ఐవో వెంకటసుబ్బయ్య, డీఈఓ మీనాక్షిలతో మాట్లాడగా పిల్లలకు సంబంధించి ఆధార్‌కార్డు, రికార్డులలోని పేర్లలో అక్షర దోషాలు, పుట్టినతేదీలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. దీంతో కొంత ఆలస్యమవుతుందన్నారు.

టమాటా!

- తగ్గుముఖం పడుతున్న టమాటా ధరలు
- భారీగా తగ్గిన ఎగుమతులు
- నష్టాల బారిన రైతులు
- ఉత్తరాది రాష్ట్రాల్లో సీజన్ ప్రారంభం



మదనపల్లె మార్కెట్‌కు వచ్చి టమాటాలు

మదనపల్లె సిటీ: టమాటా ధరలు రైతులను ఊరించి ..ఉసూరుమనిపించాయి. ఒక్కసారిగా ఆకాశాన్నంటి.. ఉన్నట్టుండి కిందకు పడిపోయాయి. 10 కిలోల బాక్సు రూ.500 నుంచి రూ.300కి దిగిపోవడంతో అన్నదాతలకు దిక్కుతోచని స్థితి ఎదురవుతోంది. ఇదే సమయంలో ఎగుమతులు సైతం తగ్గిపోవడంతో గిట్టుబాటు దక్కడం కష్టంగా మారింది. బయటి వ్యాపారులు మార్కెట్‌కు రాకపోవడంతో ధర పతనావస్థకు చేరింది. ఉత్తరాది రాష్ట్రాల్లో టమాటా సీజన్ ప్రారంభం కావడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. మదనపల్లె టమాటా మార్కెట్‌లో గత పది రోజుల క్రితం టమాటా పది కేజీల క్రేట్ రూ.600 దాటింది. దిగుబడి సైతం ఆశించిన మేర అందుబాటులోకి రావడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా పంట దిగుబడులు తగ్గినా మంచి ధరలు ఉండటంతో రైతులు ఎంతో ఆశపడ్డారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో లోకల్ సరుకు సీజన్ ప్రారంభం కావడంతో జిల్లా నుంచి ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. దీంతో బయటి వ్యాపారులు ఇక్కడి మార్కెట్‌కు రాకపోవడంతో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మదనపల్లె మార్కెట్‌లో బుధవారం 10 కేజీల క్రేట్ గరిష్ఠంగా రూ.320, కనిష్ఠంగా రూ.270 పలికింది.

వారంలోనే తగ్గుముఖం

అక్టోబర్ 20వ తేదీ నుంచి నుంచి ధరలు తగ్గుతున్నాయి. ఈ ధరలు మరింత పడిపోయే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా మార్కెట్ నుంచి ఈ సీజన్‌లో తెలంగాణ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానాలకు ఎగుమతి చేస్తుంటారు. ఆయా రాష్ట్రాల్లో వారం రోజులుగా సీజన్ మొదలైంది. దీంతో అక్కడి అవసరాలకు స్థానిక పంటే అందుబాటులో ఉంటోంది. దీంతో ఎగుమతులు నిలిచిపోయాయి.

మదనపల్లె టమాటా మార్కెట్‌లో ధరల వివరాలు

తేదీ	మొదటి రకం (10 కేజీలు)	రెండో రకం (10 కేజీలు)
3-11-24	రూ.360	రూ.290
4-11-24	రూ.340	రూ. 268
5-11-24	రూ.360	రూ.290
6-11-24	రూ.320	రూ.266

క్లుప్తంగా

వీఆర్‌ఓపై చెప్పుతో దాడి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురానికి చెందిన వీఆర్‌ఓ మార్క్‌పై అనంతపురం జిల్లాకు చెందిన వీరప్పనేని గంగరాజు అనే వ్యక్తి చెప్పుతో దాడి చేశాడు. గతంలో మార్క్ అనే వీఆర్‌ఓ లింగాల మండలం కోమన్నూతలలో పని చేసే వాడు. గంగరాజు అనే వ్యక్తి భూమికి సంబంధించి ఎండార్స్‌మెంట్ తనకే ఇస్తావా అని రెండు రోజుల క్రితం పులివెందుల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో అందరూ చూస్తుండగానే వీఆర్‌ఓపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడుతూ చెప్పుతో కొట్టినట్లు సమాచారం. ఈ విషయంపై వీఆర్‌ఓలందరూ కలిసి పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కొండాపురం : గండికోట నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ స్పెషల్ కలెక్టర్ జి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిహారం రూ.486 కోట్లు మంజూరు కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ పరిహారం మంజూరుకు కృషి చేస్తామన్నారు. అన్ని అర్హతలున్నా కొందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని, వాటిని పరిశీలించి న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. పునరావాస కేంద్రాల్లో శ్మశాన వాటిక స్థలం, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. పునరావాస కాలనీలో స్థలాలు కేటాయించిన వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని వారుకోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని దేవునికడప ఆర్చి వద్ద వున్న రింగురోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కడప నగరానికి చెందిన వెన్నపూస రామసుబ్బారెడ్డి (55) బైపాస్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా తుఫాన్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రవి కుమార్ తెలియజేశారు.

గొంతు కోసి వ్యక్తి హత్య



వెంకటనారాయణ మృతదేహం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి చెరువు కట్టవద్ద ఓ వ్యక్తిని గొంతు కోసి హత్య చేసిన సంఘటన బుధవారం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పితాని వెంకటనారాయణ(40) కొంత కాలంగా ఇక్కడ వివిధ పనులు చేసుకొంటూ జీవనం సాగించేవాడు. అతన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. సంఘటన స్థలంలో ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు గుర్తించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

అధికారం అండగా బియ్యం అక్రమ రవాణా

- ముగ్గురు టీడీపీ కౌన్సిలర్ల ప్రమేయం
- ఇంటి యజమాని కోసం సాయంత్రం వరకు వేచి ఉన్న అధికారులు
- బియ్యం క్యాటరింగ్ కోసం తెచ్చుకున్నాడని నివేదిక



ఇంటి యజమాని కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, ఎఫ్ఐ, పోలీసులు



ఇంటిలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం బస్తాలు



పట్టుకున్న బియ్యాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : అధికార పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్ల ప్రమేయంతో ప్రొద్దుటూరులో బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. అందులో భాగంగానే రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం 33 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీకి సంబంధించి ఐదవ వార్డులోని పాత డీఎస్పీ కార్యాలయం వెనుక ఇంటిలో 270 బస్తాల రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం. మంగళవారం రాత్రి నిల్వ ఉంచిన బియ్యాన్ని తరలిస్తున్నారని మీడియా ప్రతినిధులకు సమాచారం అందింది. అర్ధరాత్రి వరకు మీడియా ప్రతినిధులు నిఘా ఉంచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తరలించారు. ఈ ఆనవాళ్లు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇతరుల ఫిర్యాదు మేరకు మిగిలిన 33 బస్తాల బియ్యాన్ని బుధవారం ఉదయమే అధికారులు గుర్తించారు. అయితే ఆ ఇంటికి తాళాలు వేసి ఉండటంతో.. తహసీల్దార్ గంగయ్య ఆదేశాల మేరకు వీఆర్‌ఓ శివారెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్‌రెడ్డితోపాటు త్రీటౌన్ పోలీసులు సాయంత్రం వరకు కాపలా ఉన్నారు. అధికారులు ఇంటి యజమానికి ఫోన్ చేసినా స్పందించలేదు. కాలయాపన చేసి సాయంత్రానికి వచ్చారు. ఇంటి తలుపులు తెరవగా కేవలం 33 బస్తాలు మాత్రమే ఉన్నాయి. వీటిని ప్రభుత్వ బస్తాల్లో నుంచి ప్రైవేటు బస్తాల్లోకి మార్చి నిల్వ ఉంచారు. ఈ బస్తాలను 30వ రేషన్ షాపునకు తరలిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున ఈ సందర్భంగా తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని తరలిస్తుండగా ఇంటి యజమాని కనిపించకుండా పారిపోయాడు. సినిమాను తలపించే ఈ సంఘటనను చూసి అందరూ నవ్వుకున్నారు.

ముగ్గురు టీడీపీ కౌన్సిలర్ల పాత్ర

ప్రొద్దుటూరులో బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ప్రత్యేక టీం ఉంది. ముగ్గురు వ్యాపారులు ప్రతినెల డీలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న విషయం బహిరంగ రహస్యం. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు.. వ్యాపారులకు పోటీగా రంగంలోకి దిగారు. వీరిలో ఓ వార్డు కౌన్సిలర్, మరోవార్డు కౌన్సిలర్ భర్త (ఈయన గతంలో కౌన్సిలర్‌గా ఉన్నారు), మరో మహిళా కౌన్సిలర్ కుమారుడు తమ కనుసన్నుల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేసుకుని వీరు బియ్యం వ్యాపారం సాగిస్తున్నారు. నెల రోజుల క్రితమే ఓ వార్డు కౌన్సిలర్ ఇంటి పక్కన రేషన్ బియ్యాన్ని పట్టుకుని అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఓ వైపు పోలీసు అధికారులు, మరో వైపు విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు నిఘా ఉంచినా బియ్యం వ్యాపారం మాత్రం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. బుధవారం రాత్రికి ఈ బియ్యం పల్లా చంద్రశేఖర్‌వి అని, ఆయన క్యాటరింగ్ నిర్వహిస్తుంటాడని, పొంగలి, ఇతర వంటకాల కోసం బద్వేలు నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్నాడని అధికారులు రికార్డులో రాసుకుని మమ అనిపించారు.

స్థలం ఆక్రమణకు యత్నం

న్యాయం కోసం బాధితుల వేడుకోలు



తమకు న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

కడప రూరల్ : అధికార పార్టీ అండతో స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కడప నగరానికి చెందిన బాధితులు జాకీర్, అబ్దుల్ రఫీ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రామరాజుపల్లె పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ ప్రాంతంలో సర్వే నంబర్ 113లో 4.36 ఎకరాల స్థలం ఉందన్నారు. అందులో మొత్తం 15 మంది 2002లో లతీఫ్‌సాబ్ వారసుల నుంచి నిబంధనల ప్రకారం కొనుగోలు చేశామని అన్నారు. ఇందుకు సంబంధించి అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆ స్థలంలో చుట్టూ రక్షణ గోడను నిర్మించామని పేర్కొన్నారు. సోమవారం కొంత మంది అధికార పార్టీ అండతో ప్రహరీని దౌర్జన్యంగా కూల్చివేశారని ఆరోపించారు. పైగా ఇది తమ స్థలం ఖాళీ చేయండని తమపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో 15 గొర్రెలు మృతి

త్రుటిలో తప్పించుకున్న వాటి యజమాని



మృతి చెందిన గొర్రెలు

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె గ్రామం కాట్లగంటివారిపల్లెలో బుధవారం విద్యుత్ ప్రమాదానికి గురై 15 గొర్రెలు మృతి చెందాయి. వాటి యజమాని నరసింహనాయుడు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహనాయుడు తన గొర్రెలను రాత్రి ఇంట్లో ఉంచి తెల్లవారుజామునే ఆరుబయట ఉన్న కంచె లోపల తోలేవాడు. రోజులాగే బుధవారం కూడా గొర్రెలను కంచె లోపలికి తోలుకెళ్లాడు. ఇంకా చీకటి ఉండటంతో అప్పటికే తెగిపడి ఉన్న 11 కేవీఏ విద్యుత్ వైరును గమనించలేదు. గొర్రెలు కంచె లోపలికి వెళ్లగానే విద్యుత్ షాక్‌కు గురై 15 మృతి చెందాయి. ఒక్కసారిగా గొర్రెలు కిందపడి పోవడంతో.. వాటి వద్దకు వెళ్లే ప్రయత్నంలో అతడు కూడా షాక్‌కు గురై వెనక్కు పడి స్పృహ కోల్పోయాడు. వెంటనే పక్కనే ఉన్న గ్రామస్తులు గుర్తించి అతన్ని కాపాడారు. వెంటనే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపేసి సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు. గొర్రెల విలువ సుమారు రూ.2 లక్షల పైనే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన గొర్రెలకు నాగలగుట్టపల్లె పశువైద్యాధికారి మధుసూదన్ పోస్టుమార్టం నిర్వహించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం తెట్టు గ్రామం మండంవారిపల్లెకు చెందిన ఆదెప్ప (58) ద్విచక్రవాహనంలో అంగళ్లు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పులుసుగుంతల గ్రామానికి చెందిన రైతు టి.రమణ (48) ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వస్తూ మార్గంమధ్యలో ఎదురు ఎదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన అప్పిరెడ్డి (52) తంబళ్లపల్లె ట్రాన్స్‌కో విభాగంలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలోని దేవులచెరువు వద్ద టెంపో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం



మణికంఠ (ఫైల్)

కడప అర్బన్/ సిద్దవటం : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మృత్యుంజయకుంటలో నివసించే పేటేటి మణికంఠ (16) అనే బాలుడు పెన్నా నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. కడప నగర శివార్లలోని గండి వాటర్ ప్రాంతానికి స్నేహితులతో కలిసి మణికంఠ ఈ నెల 3న ఈతకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆ బాలుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పెన్నానదిలో బుధవారం మధ్యాహ్నం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి మృతదేహాన్ని వెతికేందుకు గజ ఈతగాళ్లను, డ్రోన్ కెమెరాలను ఉపయోగించారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె ప్రాంతానికి.. నీటి ప్రవాహానికి కొట్టుకుని వెళ్లిన మణికంఠ మృతదేహాన్ని ఎట్టకేలకు పోలీసులు తీసుకుని వచ్చి రిమ్స్ మార్చురీలో వుంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వ్యక్తిగత సమస్యలతో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నక్కలదిన్నెలో నివాసమున్న నగీనా (22) రీడింగ్ రూము వీధిలోని ఓ బట్టల షాపులో పని చేస్తోంది. అక్కడే పని చేస్తున్న యువకుడితో చనువుగా ఉండటంతో అతని బంధువులు నగీనాను మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఎలుకల నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది.

ఆలయ భూముల వేలంలో ఘర్షణ



ఘర్షణలో చెల్లాచెదురైన కుర్చీలు



ఎండోమెంట్ అధికారులు, గ్రామస్తులను విచారణ చేస్తున్న పోలీసులు

పోలీసులకు ఫిర్యాదు

రామసముద్రం : మండలంలోని కురిజల గ్రామంలో వెలసిన అతిపురాతన శ్రీచెన్నకేశవస్వామి ఆలయం మాన్యం భూముల వేలంపాటలో ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కురిజల గ్రామస్తులు శిథిలావస్థలో ఉన్న పురాతన ఆలయాన్ని బాగు చేయాలని దేవదాయశాఖ అధికారులకు గతంలో విన్నవించారు. ఈ మేరకు ఆక్రమణలో ఉన్న ఆలయానికి చెందిన భూములను గుర్తించి వేలంపాట నిర్వహించేందుకు బుధవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవో రమణ గ్రామానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న భూమి అనుభవిస్తున్న రైతు చెంగారెడ్డి, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని.. నానా దుర్భాషలాడుతూ అధికారులు, గ్రామస్తులపై కుర్చీలు విసరడంతో ఘర్షణకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల వారిని సర్దుమనిగించారు. అనంతరం దేవదాయశాఖ అధికారులు, గ్రామస్తులు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. కాగా సంఘటన స్థలానికి వెళ్లి ఘటనను చిత్రీకరిస్తున్న తనపై శ్రీకాంత్ దాడి చేసి, తన సెల్ ఫోన్ లాక్కుని, దుర్భాషలాడినట్లు విలేకరి జశ్వంత్ తెలిపారు. ఈ విషయమై విలేకరులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చీమల దాడిలో గాయపడిన డ్రైవర్ మృతి



మృతి చెందిన ద్వారకనాథరెడ్డి

కురబలకోట : తాగిన మైకంలో చీమల దాడికి గురైన ఆటో డ్రైవర్ ద్వారకనాథరెడ్డి (29) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఎర్రమద్దివారిపల్లెకు చెందిన ద్వారకనాథరెడ్డి(29) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అతిగా మద్యం సేవించి పల్లె దగ్గరున్న కొండ కింద నిద్రించారు అపస్మారక స్థితిలో ఉన్న ఇతన్ని చీమలు చుట్టుముట్టాయి. అవి కుట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు మంగళవారం ఇతన్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని కలిచెర్ల - కోటకాడపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పీవీ రమణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన జి.గంగులప్ప (57) తన ద్విచక్రవాహనంలో కలిచెర్ల నుంచి కోటకాడపల్లెకు వెళుతుండగా.. ఎదురుగా కలిచెర్లకు వస్తున్న ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రాహ్మణులను అవమాన పరుస్తున్న టీడీపీ

- టీటీడీ కమిటీలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం అవమానకరం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథశర్మ ధ్వజం



కమలాపురం : టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణులకు తీరని అన్యాయం చేసి అవమాన పరుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సత్య సాయినాథశర్మ ఆరోపించారు. మంగళవారం స్థానిక తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే బ్రాహ్మణ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని ఆగ్రహించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఆలయ కమిటీలో బ్రాహ్మణులకు చోటు కల్పిస్తానని స్వయంగా బాబు ప్రకటించినప్పటికీ.. ఆచరణలో అమలు చేయకపోవడం బ్రాహ్మణులపై ఆయనకున్న కపట ప్రేమకు నిదర్శనమని ధ్వజమెత్తారు. టీటీడీ బోర్డు కమిటీలో 29 మంది సభ్యులున్నప్పటికీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఒక్కరు కూడా లేకపోవడం దారుణం అన్నారు. టీటీడీ బోర్డులో బ్రాహ్మణులకు చోటు దక్కుతుందని అనేక మంది టీడీపీ బ్రాహ్మణ నాయకులు ఆశించారని, అయితే బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఒక్కరిని కూడా కమిటీలోకి తీసుకోకుండా తీవ్రంగా అవమాన పరిచారని ఆయన మండిపడ్డారు. అలాగే రాష్ట్రంలో 21 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినప్పటికీ ఒక్క బ్రాహ్మణునికి కూడా చోటు కల్పించక పోవడం విచారకరమన్నారు. 2024 ఎన్నికల ముందు బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని తన విజయం కోసం వాడుకున్న చంద్రబాబు.. అధికారం వచ్చిన తర్వాత బ్రాహ్మణుల పట్ల చిన్నచూపు చూస్తుండటం భావ్యం కాదన్నారు. బ్రాహ్మణుల పట్ల విశ్వాసం కలిగి ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే బ్రాహ్మణులంతా నడవాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తక్షణం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పిన సీఎం చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కమిటీని సైతం నియామకం చేయకపోవడం వారికి అన్యాయం చేసినట్లు కాదా? అని ఆయన ప్రశ్నించారు. బ్రాహ్మణుల పట్ల వివక్ష చూపుతున్న టీడీపీని బ్రాహ్మణులంతా వీడాలని ఆయన పిలుపునిచ్చారు. టీటీడీ బోర్డులో బ్రాహ్మణులకు స్థానం కల్పించి చంద్రబాబు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 68వ ఎస్జీఎఫ్ఐ బాలబాలికల అండర్ -19 బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలబాలికలకు విడివిడిగా వ్యక్తిగత పోటీలు నిర్వహించి జాతీయ జట్టుకు ఐదుగురు చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలికల జట్టులో పి.శ్రావణి (వైజాగ్), సి.భవితశ్రీ (కర్నూలు), శ్లోకా శ్రీ, రమ్యశ్రీ (వైఎస్ఆర్ జిల్లా), కె.లహరి (వైజాగ్), బాలుర విభాగంలో టి.చరణ్‌రామ్, ప్రణవ్‌సాయి (చిత్తూరు), ఆర్.పార్థివ్ (వైజాగ్), ఎ.తరుణ్ (కర్నూలు), ఎ.త్రిలోక్ (పశ్చిమగోదావరి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల జట్టులో వైఎస్ఆర్ జిల్లా నుంచి ఇద్దరు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడం విశేషం. వీరు ఈ నెల 17 నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నారు. క్రీడాకారులకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానిబాషా, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాసరావు, ఎస్జీఎఫ్ఐ కార్యదర్శులు అరుణ, విజయ ప్రసాద్‌రెడ్డిలు అభినందించారు.

బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని నిరసన



ఎంఈఓ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నిరసన

పులివెందుల టౌన్ : బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొంది తప్పుదారి పట్టిస్తున్న అంకాలమ్మపేట పాఠశాల హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ హెచ్‌ఎం బీసీ వడ్డెర కులానికి చెందిన వ్యక్తి అని, అయితే ఎస్టీ ఎరుకల కింద రికార్డు తయారు చేసి ఎస్సార్ పొంది తప్పుడు దారిలో ఉద్యోగం చేయడం జరుగుతోందన్నారు. ఆయన పుట్టినప్పటి నుంచి పెరిగిన ఊరిలో కులం గురించి జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ విచారణ చేసి.. అతను పొందిన ఉద్యోగాన్ని సర్వీస్ నుంచి తొలగించాలన్నారు. ఉద్యోగం ద్వారా ప్రతినెలా పొందిన జీతాలను కూడా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, బెనర్జీ, విద్యార్థి సంఘ నాయకులు బయన్న, శీను, శేఖర్, ప్రజా నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం




ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్న ఏపీ సీఎస్ఎఫ్ డీపీపీ నీరజారెడ్డి

వేంపల్లె : ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఏపీ సీఎస్ఎఫ్ ప్రాజెక్ట్ డీపీపీ నీరజారెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె పట్టణ శివారు ప్రాంతంలోని రైతు శాస్త్రవేత్త అజిత కుమారి ప్రకృతి వ్యవసాయ పొలంలో శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన పీఎండీఎస్, 365 రోజులు భూమిని కప్పి ఉంచడం, మల్చింగ్, ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్, ఘన ద్రవజీవామృతాలు తదితర పద్ధతులు పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునని తెలిపారు. అదేవిధంగా ప్రజలకు రసాయనాలు లేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో మెంటార్స్ జంగయ్య, బాబు, పావని, రామాంజనేయులు, మెంటార్ ఇంటర్న్ నిరంజన్‌రెడ్డి, శివ శంకర్‌రాజు, నాగరాజు, వెంకటరమణ, నీలావతి, శైలజ, చంద్రశేఖర్, వెంకటేష్, హరిప్రియ, జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతు శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆత్మహత్య కేసు నీరుగారుస్తున్న పోలీసులు

న్యాయం జరగలేదంటూ బంధువుల ఆరోపణ



మాట్లాడుతున్న మృతురాలి రమాదేవి కుటుంబ సభ్యులు

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణం కొత్తపేటలో ఆగస్టు 17న గ్యాస్‌లీక్ చేసుకుని తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఎర్రగుడి రమాదేవి(34) కేసును పోలీసులు నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె సోదరుడు గాలివీటి నారాయణ, గాలివీటి వెన్నెల, బంధువులు శాంతమ్మ, సరోజమ్మ, లక్ష్మీదేవి ఆరోపించారు. ఈ కేసు విషయంలో వారు మూడో సారి అన్నమయ్య జిల్లా ఎస్పీని బుధవారం కలిశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ చిత్రపటం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. తన భర్తతో మృతురాలు రమాదేవికి వివాహేతర సంబంధం ఉందని మనసులో ఉంచుకున్న సచివాలయ ఉద్యోగి ప్రతి నిత్యం ఆమెను ఏదో ఒక రూపంలో వేధిస్తూనే ఉందని ఆరోపించారు. అయితే రమాదేవి భర్త ఎర్రదొడ్డి రాజా సచివాలయ ఉద్యోగినితో సన్నిహితంగా ఉంటారని, వాళ్లిద్దరూ కూడా నిత్యం ఫోన్‌లో మాట్లాడుకుంటూ మృతురాలికి నరకం చూపించే వారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రమాదేవి భర్తతో సచివాలయ ఉద్యోగినికి, సచివాలయ ఉద్యోగి భర్తతో రమాదేవికి వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆ ఇరువురు మహిళలు అనుమానించారని చెప్పారు. ఆగస్టు 17న రాత్రి 10.30 గంటలకు మృతురాలు ఇంటి వద్దకు సచివాలయ ఉద్యోగిని వెళ్లి ఇంటి బయటకు వచ్చి తన చేతిలో చస్తావా? ఇంట్లోనే మరణిస్తావా? అంటూ బజారులో కేకలు వేయడం, బూతులు తిట్టడం వల్ల అవమానానికి గురైన రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సచివాలయ ఉద్యోగిని ఆరోజు బజారులో తిట్టకుండా ఉండి ఉంటే.. రమాదేవి చనిపోయే అవకాశం లేదన్నారు. కాగా పోలీసులు మాత్రం కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారని వారు ఎస్పీకి అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రధాన కారణమైన సచివాలయ ఉద్యోగినిపై వెంటనే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కువైట్‌లో ఉన్న రమాదేవి భర్తను తక్షణమే దేశానికి రప్పించి శిక్షించాలని వారు కోరారు.

బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్పీ : ఓపీడీఆర్ నేత ఈశ్వర్

కింది స్థాయి పోలీసుల వద్ద న్యాయం జరగలేదంటూ జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న బాధితుల పట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర సహాయకార్యదర్శి టి.ఈశ్వర్ ఆరోపించారు. ముఖ్యంగా కొత్తపేటలో రమాదేవి తన ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడడానికి కారణం సచివాలయం ఉద్యోగిని అని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నా.. ఏమాత్రం పట్టించుకోకుండా సీఐ దగ్గరకు వెళ్లండి అంటూ చేతులు దులుపుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. రమాదేవిని సచివాలయ ఉద్యోగిని వేధించినట్లుగా, ఆమె ఇంటిపై దౌర్జన్యానికి వచ్చినట్లుగా సీసీ కెమెరాలలో రికార్డు అయినప్పటికీ.. ఉన్నత స్థాయిలో ఉన్న ఎస్పీ సమగ్ర విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహించడం బాధితులకు అన్యాయం చేయడమే అన్నారు. సమావేశంలో ఆయనతో పాటు మృతురాలు రమాదేవి కుటుంబీకులు పాల్గొన్నారు.